క్లుప్తంగా

చెకుముకి ప్రతిభా పరీక్ష పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజోలు: జన విజ్ఞాన వేదిక చెకుముకి ప్రతిభా పరీక్ష పోస్టర్‌ను మండల రిసోర్స్ సెంటర్ వద్ద యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఈఓ టీఎస్‌కేడీ ప్రసాదరావు గురువారం ఆవిష్కరించారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో 8, 9, 10 తరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఈ నెల 18వ తేదీన పాఠశాల స్థాయి, నవంబర్ ఒకటో తేదీన మండల స్థాయి, నవంబర్ 23వ తేదీన జిల్లాస్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. డిసెంబర్ 12, 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయన్నారు. యూటీఎఫ్ గౌరవ అధ్యక్షుడు రేఖపల్లి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అడబాల కాశీ విశ్వేశ్వరరావు, జిల్లా కుటుంబ సంక్షేమ డైరెక్టర్ ఉండవల్లి శ్రీనివాస్, మండల శాఖ అధ్యక్షుడు కె.రాజబాబు, ప్రధాన కార్యదర్శి కె.వి.ఎస్.ఎన్.బాబు, కోశాధికారి కె.రామదుర్గారావు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యం కావాలి



చొప్పెల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామీణ బ్యాంకు శాఖాధికారులు, ఖాతాదారులు

ఆలమూరు: దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు అవినీతి రహిత వికసిత్ భారత్ రూపకల్పన జరగాలని ఏపీ గ్రామీణ బ్యాంకు విజిలెన్స్ అధికారి ఈదర రాంబాబు అన్నారు. చొప్పెల్లలో ఉన్న గ్రామీణ బ్యాంకు ఆవరణలో గురువారం విజిలెన్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. విజిలెన్స్ అధికారి రాంబాబు మాట్లాడుతూ తమ బ్యాంకు రాష్ట్ర వ్యాప్తంగా మూడు నెలల పాటు అవినీతికి వ్యతిరేకంగా బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అనంతరం దేశ ఆర్థిక, రాజకీయ సత్యనిష్ఠ ప్రతిజ్ఞ చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కార్యాలయం నుంచి కనకమహాలక్ష్మి ఆలయ నుంచి వరకు ర్యాలీ నిర్వహించారు. హెచ్‌డీ ఎం.ల చైతన్య, మేనేజర్ కె.ఉదయ్ కుమార్‌దొర, బ్యాంకు శాఖ ప్రతినిధులు ఎం.సాగర్, ఆర్ సంతోష్ కుమార్, బి.కీర్తన, వడ్డీ రవికుమార్ పాల్గొన్నారు.

పుష్కర అభివృద్ధి పనులపై సమీక్ష

ఆలమూరు: రాబోయే పుష్కరాలకు సంబంధించి తీసుకోవాల్సిన అభివృద్ధి పనులపై గురువారం దేవదాయశాఖ మండలంలోని వివిధ దేవాలయాలను సందర్శించింది. దేవదాయ డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో అధికారులు బృందం మండలంలోని ప్రధాన దేవాలయాలను సందర్శించి మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై చర్చించారు. అనంతరం గ్రామాల్లోని ఆలయాల వారీగా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై స్థానికుల సమక్షంలో సమీక్ష నిర్వహించారు. రామచంద్రపురం తనిఖీదారు ఆర్.బాలాజీ రాంప్రసాద్, ఏఈ ఫణి, ఈఓ ఎంఎస్ఆర్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో విద్యార్థుల ప్రతిభ



ఎస్‌జీఎఫ్ గేమ్స్ విజేతలతో పీఈటీలు

మలికిపురం: మండల పరిధిలోని బట్టేలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ గేమ్స్‌లో విజేతల వివరాలను గేమ్స్ మండల కో ఆర్డినేటర్ వి.కుమార్ మీడియాకు తెలిపారు. కబడ్డీ విభాగంలో అండర్-17లో విన్నర్స్‌గా బట్టేలంక పాఠశాల టీమ్, రన్నర్స్‌గా జి.పల్లిపాలెం పాఠశాల టీమ్, అండర్-14లో విన్నర్స్‌గా బట్టేలంక పాఠశాల టీమ్, రన్నర్స్‌గా గూడపల్లి పల్లిపాలెం పాఠశాల టీమ్, వాలీబాల్ విభాగంలో అండర్-17లో విన్నర్స్‌గా కేశనపల్లి పాఠశాల టీమ్, రన్నర్స్‌గా గుడిమెళ్ళంక పాఠశాల టీమ్, అండర్-14లో విన్నర్స్‌గా విశ్వేశ్వరాయపురం పాఠశాల టీమ్, రన్నర్స్‌గా పడమటిపాలెం పాఠశాల టీమ్, కోకో విభాగంలో అండర్-17లో విన్నర్స్‌గా బట్టేలంక పాఠశాల టీమ్, రన్నర్స్‌గా విశ్వేశ్వరాయపురం పాఠశాల టీమ్, అండర్-14లో విన్నర్స్‌గా బట్టేలంక టీమ్ ఎంపికైనట్టు ఆయన వెల్లడించారు.

కాలిన గాయాలతో చికిత్స పొందుతూ అర్చకుడి మృతి

పి.గన్నవరం: మానేపల్లి గ్రామంలో ఈనెల నాలుగో తేదీ రాత్రి దసరా మహోత్సవాల ఊరేగింపు సందర్భంగా జరిగిన బాణసంచా ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అర్చకుడు వెలవలపల్లి విజయబాబు(55) గురువారం మృతి చెందినట్టు ఎస్సై బి.శివకృష్ణ తెలిపారు. ఒక ఊరేగింపునకు చెందిన తారా జువ్వ, మరొక ఊరేగింపులోని ట్రాక్టర్‌పై పడి అందులో ఉన్న జువ్వలు ఫైర్ కావడంతో ఇద్దరు అర్చకులు తీవ్ర గాయాలపాలైన విషయం విదితమే. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విజయబాబు మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృత దేహానికి అమలాపురం ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్టు ఎస్సై వివరించారు.

మృత్యుదారులు

- ఆక్రమణలో రహదారుల మార్జిన్లు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- గ్రామాల్లో తరచూ ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు

మలికిపురం: గ్రామాల్లో రహదారులూ ఆక్రమణలకు గురవుతున్నాయి. రోడ్డు మార్జిన్లను ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో వల్ల ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో రోడ్లను ఆక్రమించి పార్కింగ్‌లుగా వినియోగించుకుంటున్నారు. దీంతో రోడ్లు ఇరుకుగా మారి ట్రాఫిక్ జామ్‌తోపాటు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆయా రోడ్లను పర్యవేక్షించాల్సిన ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్, గ్రామ పంచాయతీలు పట్టించుకోవడంలేదు.

ఇదీ సంగతి..

రాజోలు నియోజకవర్గంలో సముద్ర తీర గ్రామాలతోపాటు అన్ని గ్రామాల్లోనూ రోడ్ల మార్జిన్లు ఆక్రమణకు గురయ్యాయి. పంచాయతీ రాజ్ రోడ్లు, పంచాయతీ రోడ్లు, ఆర్అండ్‌బీ రోడ్డు పలు చోట్ల ఇలా ఆక్రమించి వ్యాపార స్థావరాలుగా వినియోగించుకుంటున్నారు. రోడ్లు పక్కన దుకాణాలు ఏర్పాటు చేసుకున్న యజమానులకు ఎదుట పార్కింగ్ ఉండదు. రోడ్డు పక్క మార్జిన్ స్థలాన్ని కూడా ఆక్రమించి వివిధ వ్యాపార వస్తువులను ఉంచుతున్నారు. ఇసుక, కంకర, ఇనుము వ్యాపారులు అయితే వాటినే రోడ్డు పక్కన ఉంచుతున్నారు. నివాస గృహాల వద్ద అయితే కొబ్బరి చెట్లను వేస్తున్నారు. రోడ్లపై వెళ్లే వాహన చోదకులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. కొన్ని సమయాల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు. అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పలువురు గాయపడుతున్నారు.



అంతర్వేది పుణ్యక్షేత్రం ఆర్అండ్ బీ రోడ్డు మార్జిన్‌లో పార్కింగ్ చేసిన లారీ

జరిగిన ప్రమాదాలు

మండలంలో గుడిమెల్లంక, శంకరగుప్తం, చింతలమోరి, పడమటిపాలెం, అంతర్వేది గ్రామాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. శంకరగుప్తం గ్రామంలో రెండేళ్ల క్రితం భార్య భర్తలు బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురై మృతి చెందారు. గుడిమెళ్లంకలో కూడా ఇలాగా ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారు. దిండి గ్రామంలో మార్జిన్‌లో అంతర్వేది వెళ్లి మోపెడ్‌పై వస్తున్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన దంపతులు పడిపోయాయి. వెనుక నుంచి ట్రాక్టర్ వారిపై ఎక్కడంతో ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రాంతాల్లో కొంత కాలంగా అనేక మంది ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలయ్యారు. కూడళ్ల రోడ్లు కనబడకుండా ప్రహరీలు, దడులు కట్టడం వల్ల కూడా వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. అంతర్వేది కర, కేశవదాసుపాలెం, శృంగవరప్పాడు, పడమటిపాలెం, కేశనపల్లి, తూర్పుపాలెం గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. శంకరగుప్తం- లక్కవరం రోడ్డు కూడా పూర్తిగా ఆక్రమణకు గురైంది. మోరి-చింతలమోరి రోడ్డు, సఖినేటిపల్లి- గొంది రోడ్డు, కూనవరం-కేశనపల్లి రోడ్డులో గూడపల్లి వరకూ ఇదే దుస్థితి. చింతలపల్లి – ములికిపల్లి, తాటిపాక-ములికిపల్లి, ములికిపల్లి పొన్నమండ, గోగన్న మఠం -మగటపల్లి- మామిడికుదురు, గోగన్నమఠం-కాట్రేనిపాడు రోడ్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. పొన్నమండ- కాట్రేనిపాడు, మెరకపాలెం-గొల్లపాలెం రోడ్డులో కూడా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇక నియోజక వర్గంలో ప్రధాన రోడ్డు అయిన అంతర్వేది పుణ్యక్షేత్రం వెల్లే సుమారు 13 కిలో మీటర్ల రోడ్డు కూడా ప్రమాదకరంగా ఈ రోడ్డుపై అంతర్వేదిపాలెం లోవైష్ణవుల కొట్టు ఏరియాలో ఏకంగా ఒక వ్యక్తి రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి మెరక చేసి తన లారీకి మార్కింగ్ ఏర్పాటు చేసుకున్నాడు. ప్రతిరోజూ అంతర్వేది వెళ్లే భారీ వాహనాలతో ఇక్కడ ట్రాఫిక్ జామ్ అవుతున్నా ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదు.

ఈ సమస్యలపై గత ఏడాదిగా నియోజక వర్గంలో జరిగే ప్రతి మండల సర్వ సభ్య సమావేశాలలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఏకరువు పెడుతున్నా ఏ అధికారి కూడా పట్టించుకోవడం లేదు. ఇలాంటి రోడ్లలో ఆక్రమణలపై ఆర్అండ్ బీ అధికారుల దృష్టి పెట్టాలని, రోడ్లను వెడల్పుగా చేసి అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మలికిపురంలో ఒక రోడ్డుపై ఏకంగా ఇలా ఇసుక డంపింగ్

ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా..



గ్రామాల్లో ప్రధాన ఆర్ అండ్ బీ రోడ్లతోపాటు, పంచాయతీ రాజ్ రోడ్లు సైతం మార్జిన్లు ఆక్రమణకు గురయ్యాయి. ఎన్ని సార్లు విజ్ఞప్తి చేసినా ఏ శాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. వాహన చోదకులు మార్జిన్ బారిన పడి అనేకమంది మృతి చెందుతున్నారు.

– మానుకొండ ప్రమీళ, ఎంపీటీసీ, శంకరగుప్తం

ఆక్రమిస్తే కఠిన చర్యలు



మలికిపురం ప్రధాన కూడలితో పాటు లోపలి అన్ని రోడ్ల మార్జిర్ల క్లియర్‌గా ఉండాలి. వ్యాపారులు, నివాస గృహాల యజమానులు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలు తమ దృష్టికి తీసుకురండి. ఆయా శాఖల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– తాడి ఏసు, పంచాయతీ కార్యదర్శి, మలికిపురం

15 నుంచి బాలాజీ స్వామి పవిత్రోత్సవాలు



మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి పవిత్రోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు గురువారం తెలిపారు. 15న విశ్వక్సేనారాధనతో ఉత్సవాలకు ప్రారంభమవుతాయని ఆరోజు ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. మూడు రోజులపాటు ఈ పవిత్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 16న పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 17 శ్రీవారి శాంతి కల్యాణంతో ఉత్సవాలు సంపూర్ణమవుతాయని చెప్పారు.

స్టోన్ క్రషర్ సీజ్

ఆలమూరు: జొన్నాడలో అనుమతులు లేకుండా కార్యకలాపాలను సాగిస్తున్న స్టోన్ క్రషర్‌ను అధికారులు సీజ్ చేశారు. స్థానిక గౌతమీ గోదావరి సమీపంలో అనధికారికంగా స్టోన్ క్రషర్‌ను నడుపుతుండడంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుందంటూ గ్రామస్తులు నుంచి జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేరాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంపీడీఓ ఏ రాజు నేతృత్వంలోని పంచాయతీరాజ్ సిబ్బంది నిర్వహించిన విచారణలో ఎటువంటి అనుమతి పత్రాలు లేవని తేలింది. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బంది పోలీసుల సహకారంతో ఆస్టోన్ క్రషర్‌ను గురువారం సీజ్ చేశారు. ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి చిక్కాల వీరమాత, సూపరింటెండెంట్ ఎంపీ మెహర్ ప్రకాష్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

13 నుంచి వైఎస్సార్ సీపీ రచ్చబండ

- మాజీ మంత్రి గొల్లపల్లి
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ

మలికిపురం: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా ఈ నెల 13వ తేదీ నుంచి నవంబరు 11వ తేదీ వరకూ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పేర్కొన్నారు. మలికిపురం పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రచ్చబండ గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలు గుర్తించడంతోపాటు కూటమి ప్రభుత్వం నిరంకుశంగా చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యువత భవిష్యత్‌ను ప్రమాదంలో నెట్టే విధంగా కూటమి ప్రభుత్వ పనులను అడ్డుకుని తీరుతామన్నారు. రచ్చబండ సభల నిర్వహణ షెడ్యూల్‌ను నాయకులతో కలిసి సూర్యారావు రూపొందించారు. షెడ్యూల్ ప్రకారం సభల నిర్వహణ సక్రమంగా జరిగేలా గ్రామ కమిటీలు శ్రద్ధ వహించాలన్నారు. సభలకు గ్రామంలో ప్రతి కార్యకర్త కూడా హాజరవ్వాలని సూచించారు. కల్తీ మద్యం వ్యాపారంతో రాష్ట్ర ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, కల్తీ వ్యాపారులపై కఠినంగా వ్యవహరించడం లేదని , దీనికి ముఖ్యమంత్రి చంద్రబాబుదే బాధ్యత అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాటి శివ కుమార్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, నాయకులు గుర్రం జాషువా, కుసుమ చంద్రశేఖర్, గుబ్బల మనోహర్, నేతల నాని, జాలెం విష్ణుమూర్తి, అడబాల జానకీ రామ్, తాడి సహదేవ్, బాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

అంబేడ్కర్‌కు నిజమైన వారసుడు కాన్షీరామ్

మలికిపురం: అంబేడ్కర్‌కు నిజమైన వారసుడు కాన్షీరామ్ అని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బూశి జాన్ మోసే అన్నారు. కాన్షీరామ్ 19వ వర్ధంతిని గురువారం మలికిపురం పూలే అంబేడ్కర్ భవనంలో నిర్వహించారు. జాన్‌మోసే పాల్గొని కాన్షీరామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజోలు నియోజకవర్గం అధ్యక్షుడు నల్లి ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బూషి జాన్ మోషే మాట్లాడారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకుమర్తి భూషణం, కార్యదర్శి పట్నాల సత్యనారాయణ, మలికిపురం మండల అధ్యక్షులు గుర్రం మల్లేశ్వరరావు, చుట్టుగుల్ల దుర్గాప్రసాద్, చుట్టుగుళ్ల రాజేష్, ఉంద్రు రాజ్ కుమార్, గడ్డం అఖిల్, చుట్టుగుళ్ల వరప్రసాద్, యార్లగడ్డ సామెల్, చుట్టుగుళ్ళ వీర తదితరులు పాల్గొన్నారు.



మలికిపురంలో కాన్షీరామ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జాన్‌మోసే

పాఠశాలల్లో బోధనేతర పనుల బహిష్కరణ

- ఫ్యాప్టో నిర్ణయం
- ఎంఈఓలకు వినతిపత్రం

కొత్తపేట: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు బోధనేతర యాప్‌లను బహిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాలు నిర్ణయించాయి. రాష్ట్ర ఫ్యాప్టో (ఉపాధ్యాయ సంఘాలు) పిలుపు మేరకు మండల ఫ్యాప్టో నాయకులు గురువారం సాయంత్రం స్థానిక మండల రిసోర్స్ సెంటర్ వద్ద ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కే లీలావతిలకు ఫ్యాప్టో నిర్ణయాన్ని వివరిస్తూ వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో నాయకులు మాట్లాడుతూ శుక్రవారం నుంచి పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, విద్యా బోధన, మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ మాత్రమే నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో కో ఆర్డినేటర్ బండారు నారాయణ, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి యెలిశెట్టి మురళి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు టీ విజయకృష్ణ, ఎస్టీయూ అధ్యక్షుడు ఆచంట రామచంద్రప్రసాద్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి జీ రామ్‌కుమార్, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ఎంఈఓలు హరిప్రసాద్, లీలావతిలకు వినతిపత్రాలు సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) చెకుముకి సైన్స్ సంబరాలు-2025 పోస్టర్లను జేవీవీ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రాంబాబు, ఎస్.కాశీవిశ్వనాథం ఆధ్వర్యంలో ఎంఈఓలు మట్టపర్తి హరిప్రసాద్, కే లీలావతి చేతుల మీదుగా ఆవిష్కరించారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు మాట్లాడుతూ చెకుముఖి టాలెంట్ టెస్ట్‌ను పాఠశాల స్థాయిలో ఈ నెల 18న, మండల స్థాయిలో నవంబరు ఒకటిన, జిల్లా స్థాయిలో 23న, రాష్ట్ర స్థాయిలో డిసెంబరు 12, 13, 14 తేదీల్లో నిర్వహిస్తారని తెలిపారు.

పి.గన్నవరం: ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి తప్పించాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల పదో తేదీ నుంచి బోధనేతర పనులు, విద్యా శక్తి కార్యక్రమాలను తాము బహిష్కరిస్తున్నట్టు ఫ్యాప్టో నాయకులు గురువారం పి.గన్నవరంలో ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రానందంలకు వినతిపత్రం సమర్పించారు. ఎంఈఓలను కలిసిన వారిలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు నల్లా బాలాజీ, దూనబోయిన రామకృష్ణ, శ్రీనివాస్, శ్రీనివాస్, వరిగేటి రత్నం, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యురాలికి సన్మానం

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యురాలిగా ఇటీవల నియమితులైన మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, పార్టీ యూత్ విభాగం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమితులైన పాముల దేవీప్రకాష్‌ను పార్టీ శ్రేణులు మామిడికుదురులో గురువారం ఘనంగా సత్కరించారు. వారికి పూల మాలలు వేసి, శాలువాలతో సన్మానించారు. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ శ్రేణులతో కలిసి తనవంతు కృషి చేస్తానని రాజేశ్వరీదేవి, దేవీ ప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, తోరం సూర్యభాస్కర్, జక్కంపూడి వాసు, గెద్దం వెంకటేశ్వరరావు, పిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సీఈసీ సభ్యురాలు రాజేశ్వరీదేవి, దేవీ ప్రకాష్‌ను సత్కరిస్తున్న పార్టీ నేతలు

గర్భిణులకు వైద్యసేవలు

పి.గన్నవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పి.గన్నవరం సీహెచ్‌సీలో ఆస్పత్రి సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. వారికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వై.కొత్తపల్లికి చెందిన వేణి ఫౌండేషన్ చైర్మన్ నల్లా గంగా ఈశ్వరరావు ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల అభివృద్ధి కమిటీ చైర్మన్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, కోట రాజేంద్రప్రసాద్, నల్లా పెదకాపు, మేడిది సాయిబాబు, తోలేటి సారధి, కొర్లపాటి సూరిబాబు, తోలేటి సుబ్బారావు, ఆకాశం బాబీ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి పెరవలి మండలం ఖండవల్లి గ్రామానికి చెందిన నాగుబండి వన్షిక శ్రీత పూర్ణి కుటుంబ సభ్యులు గురువారం రూ.10,116 సమర్పించారు. దాత ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

త్వరలో సమస్యల పరిష్కారం

రావులపాలెం: ఉద్యోగులకు, పెన్షనర్లకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలు త్వరలో పరిష్కారమవుతాయని, అంశాల వారీగా అన్ని డిమాండ్లు సాధించుకుంటామని రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ జేఏసీ అధ్యక్షుడు అలపాటి విద్యాసాగర్, కార్యదర్శి డి.వి రమణ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం కోనసీమ పర్యటనలో భాగంగా వచ్చిన వారికి రావులపాలెంలో ఏపీఎన్‌జీఓ కొత్తపేట తాలుకా యూనిట్ అధ్యక్షుడు మోటూరి రామారావు ఆధ్వర్యంలో ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ సంఘం బలోపేతం చేయడానికి కొత్త జిల్లాల్లో అడహాక్ కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. త్వరలో సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కొత్తపేట ఏపీఎన్‌జీఓ మాజీ అధ్యక్షుడు కొవ్వూరి ప్రభాకరరెడ్డి, కార్యదర్శి నల్లా రామారావు,సహా అధ్యక్షుడు ఏపుగంటి సురేష్, చంద్రశేఖర్, ఆలమూరు ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్ అప్పారావు, కృష్ణమూర్తి, బాపిరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు నల్లచెరువు విద్యార్థిని ఎంపిక

అయినవిల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు నల్లచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అడపా పావని సత్య అనంతలక్ష్మి ఎంపికయ్యారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాక్సింగ్ అండర్-17 క్యాటగిరిలో 70 నుంచి 75 కేజీల విభాగంలో పావని సత్య అనంతలక్ష్మి ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ నాగజ్యోతి తెలిపారు. రాజమండ్రిలో పదో తేదీ నుంచి రాజమండ్రిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్ర స్థాయిలో పోటీల్లో అడపా పావని సత్య అనంతలక్ష్మి పాల్గొంటుందన్నారు. ఆమెను అయినవిల్లి మండల విద్యాశాఖ అధికారి- 1 ఎం.శ్రీనివాసరావు మండల విద్యాశాఖ అధికారి-2 పి. శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు అభినందించారు.



అడపా పావని సత్య అనంతలక్ష్మిని అభినందిస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయిని, ఫిజికల్ డైరెక్టర్

ఘనంగా అట్లతద్దె వేడుకలు

ఆలమూరు: మండలంలో అట్లతద్దె వేడుకలు ఘనంగా నిర్వహించారు. గౌరీదేవికి పూజలు చేశారు. హిందూ సాంప్రదాయ ప్రకారం పెళ్లి చేసుకున్న ప్రతి మహిళ, పెళ్లి కావాల్సిన యువతి అట్లతద్దె పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో గౌరీపూజ చేసుకోవడం రివాజుగా మారింది. మహిళలు వేకువ జామునుంచే ఉపవాసం ఉండి రాత్రి చంద్రోదయం అయిన తరువాత విందు ఆరగించారు. ముత్తైదువులకు అట్లు, అరటి పండ్లు వాయినాలుగా అందజేస్తారు. అనంతరం సమీపంలోని చెరువులు, కాలువలకు వెళ్లి పూజలు చేస్తారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు గురువారం రూ.12 వేలు ఆర్థిక సాయం అందజేశారు. మల్కిపురం మండలం చింతలమోరి గ్రామానికి చెందిన నల్లి ఊర్మిళ(38)కు రెండు కిడ్నీలు పాడైపోయి వారానికి రెండు సార్లు డయాలిసిస్ చేయించుకుంటున్నారు. పేద కుటుంబం కావడంతో వైద్యానికి ఖర్చు పెట్టే స్తోమత లేక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో నల్లి ఊర్మిళకి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12 వేలు చెక్కును అందజేశారు.

పోరాట యోధుడు జక్కంపూడి

మామిడికుదురు: ప్రజా సమస్యలపై జక్కంపూడి రామ్మోహనరావు అలుపెరగని పోరాటం చేసిన యోధుడని మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి శ్లాఘించారు. జక్కంపూడి వర్ధంతి సందర్భంగా గురువారం మామిడికుదురులో బస్టాండ్ కూడలిలో అతని చిత్రపటానికి వైఎస్సార్ సీపీ నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. జక్కంపూడి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొమ్ముల రాము, పార్టీ నేతలు జక్కంపూడి వాసు, తోరం భాస్కర్, నెల్లి దుర్గాప్రసాద్, తులా గోపాలకృష్ణ, గెడ్డం వెంకటేశ్వరరావు, కాండ్రేగుల బాబి, పాముల దేవీ ప్రకాష్, ఎండీవై షరీఫ్, కుసుమ శ్రీను, సర్కిల్ ముస్తఫా హైదర్, బండారు కాశీ, కొప్పిశెట్టి హేమసుందర్, తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురులో జక్కంపూడికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

పి.గన్నవరం: మాజీ మంత్రి, దివంగత జక్కంపూడి రామ్మోహన్‌రావు వర్ధంతి కార్యక్రమాన్ని కాపు సంక్షేమ సంఘ నాయకుడు అద్దగళ్ల వెంకట సాయిరామ్ ఆధ్వర్యంలో పి.గన్నవరం అక్విడెక్టు పార్కులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి విగ్రహానికి నాయకులు పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. నాయకులు మందపాటి కిరణ్‌కుమార్, సరెళ్ల అప్పారావు, అద్దగళ్ల శ్రీను, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, అప్పన సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో జక్కంపూడి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

జీఎస్టీ తగ్గింపు ఫలాలు పేదలకు చేరాలి

మామిడికుదురు: జీఎస్టీ ధరలను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల పేదలకు ఎంతో మేలు జరుగుతుందని పాశర్లపూడిలంక, లూటుకుర్రు సర్పంచ్‌లు తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, అడబాల తాతకాపు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లో గురువారం సూపర్ జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సులు నిర్వహించారు. జీఎస్టీకి సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీటీసీ నామన వెంకటేశ్వరరావు, బోణం బాబు, కూటమి నేతలు, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

కొత్తపేట: జీఎస్టీపై అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం అవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మోడేకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయంలో, గొలకోటివారి హైస్కూల్ వద్ద సర్పంచ్ రామలక్ష్మి అధ్యక్షతన అవగాహన సదస్సులు నిర్వహించారు. స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



లూటుకుర్రు పీహెచ్‌సీలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సర్పంచ్ తాతకాపు

ఆలమూరు: మండలంలో చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో జీఎస్టీపై అవగాహన కార్యక్రమంజరిగింది.

పి.గన్నవరం: స్థానిక సీహెచ్‌సీలో జీఎస్టీపై నిర్వహించిన అవగాహన సదస్సులో సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రరావు, ఆస్పత్రి వైద్య సిబ్బంది, మెడికల్ షాపుల యజమానులు పాల్గొన్నారు.